# అపోహ ముప్పులు

## రేణుకారాణి

"ఆత్మలున్నాయా?" అనే శీర్షికకు వచ్చే ఉత్తరాలన్నీ వారం,! వారం చదువుతున్నాను. అవే నా కథకి ఇన్‌స్పిరేషన్. ఆత్మలున్నాయని భ్రమపడి మనసులో అలాటి ఆలోచనలు వెర్రితలలు వేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో, ఎటువంటి ఉపద్రవాలు సంభవిస్తాయో?.. ఊహించి వ్రాసిన కథ ఇది..

ఒకవేళ నిజంగానే.. ఇలాంటి భ్రమలోపడి ఏదైనా నేరంచేస్తే.. శిక్ష ఏమిటి?

"మృదులా!"

మందగమనంతో నడిచిపోతున్న మృదుల చటుక్కున వెనుతిరిగి చూసి అసహ్యంగా మొహం చిట్లించింది.

"ప్లీజ్! మృదులా! ఒక్కసారి నామాట విను!"

"షటప్!" విసురుగా అడుగులు వేసింది మృదుల

"ప్లీజ్! నన్నర్థం చేసుకోవా?" దీనంగా వుందతని గొంతు.

మృదుల నడక వేగం హెచ్చించింది. బస్‌స్టాపు దగ్గరవుతుంది. మృదుల త్వరత్వరగా అడుగులు వేస్తూ వెనక్కి తిరిగి చూసింది.

వేడుకోలుగా, అర్థిస్తున్నట్లుగా చూసాడు దివాకర్. గొంగళిపురుగును చూసినట్లుగా ఒళ్ళు గగుర్పొడిచింది. 'వీడికి ఏం పనిలేనట్లుంది. రోజూ ఇలా వెంటబడి వేధించుకుతింటున్నాడు. ఎలాగైనా వీడి భరతం పట్టాలి" దృఢంగా నిశ్చయించుకుంది మృదుల.

* * *

"ఏమిటే! మృదూ! కథానాయిక వ వుతున్నావేమిటే!" చిలిపిగా అడుగుతున్న స్నేహితురాలు సరిత వేపు అర్థంకానట్లు చూసింది మృదుల.

"అబ్బో! ఏమీ తెలియనట్లు చూస్తావేం! నువ్వు నాకిచ్చిన నోట్సులో... అల్లరిగా నవ్వి చేతిలోని కాగితాన్ని అటూ ఇటూ వూపింది సరిత.

"ఏమిటది?" గబుక్కున ఆ కాగితాన్ని లాక్కుంది మృదుల.

"అది ప్రేమలేఖ" సరిత మాటలకి మృదుల మొహం కందగడ్డలా అయింది. కోపంగా ఆ కాగితాన్ని ముక్కలు చేయబోయింది.

"ఆగవే తల్లీ! పాపం! ఎవరోగాని చాలా ఘాటుగా వ్రాశాడే. ఓ సారి చదివి చూడవే! ఎవరే ఆ ప్రేమ పిపాసి..." కొంటెగా అంటున్న సరిత మాటలకి ఉగ్రంగా చూసి, ఉత్తరం విప్పింది.

"నా ప్రాణాతి ప్రాణమైన మృదులా!

నేనెవరో నీకు తెలుసు. ప్రతినిత్యం నిన్ను పూజించే ప్రేమ పూజారిని. నీ ఆరాధకుడ్ని. నీ సౌందర్యంతో ఇహలోకాన్ని మరచి నీ ప్రేమలోపడ్డ పిచ్చివాడ్ని.

దేవీ! ఒక్కసారి! ... ఒక్కసారి ఈ దీనుని కరుణించవా?... నాతో మాట్లాడవా? నా హృదయాన్ని పుష్పంలా నీకు సమర్పిస్తాను. నా ప్రేమ బృందావనంలోకి, అడుగడుక్కి ఆశల పూలరెక్కలు పర్చి ఆహ్వానిస్తాను. నీ కొరకే అలమటిస్తూ జవాబుకై వేయికళ్ళతో నిరీక్షిస్తూ..

నీ ప్రేమ పిపాసి"

చేతిలోని కాగితం ముక్కలుముక్కలుగా మారిపోయింది. నాగినిలా బుసలుకొడుతూ తలెత్తింది. దూరంగా మృదుల ప్రతి చర్యను గమనిస్తున్న దివాకర్ నిరాశగా నిట్టూర్చి వెనుదిరిగిపోతున్నాడు. ప్రేటుతిన్న ఉరగాంగనలా ఉరవడితో క్లాసురూంలోకి నడిచింది మృదుల.

* * *

ప్రియాతిప్రియమైన జీవిత సర్వస్వమైన నా మృదులా!

అందరాని చందమామవని తెలిసీ నిన్ను చూడకుండా, నీ సాహచర్యం లేకుండా ఒక్క క్షణంకూడా బ్రతకలేనన్పిస్తుంది. చివరిసారిగా ఓ కోరిక కోరుతున్నాను. ఆ తర్వాత నీ జోలికి రాను. ఒక్కసారి నీతో మాట్లాడడానికి అవకాశమివ్వు. మనోవేదనని విప్పనివ్వు! తర్వాత నీ నిర్ణయమెట్లున్నా సరే. సంతోషంగా స్వీకరిస్తాను. లేకపోతే ఆత్మాహుతి చేసుకుంటాను. నీపేరు స్మరిస్తూ మరణాన్ని ఆనందంగా ఆహ్వానిస్తాను.

మృదూ! మృదువైన అధరాలతో ఒకటంటే ఒకసారి "దివాకర్ ఐ లవ్ యూ" అంటే చాలు. తలచుకొంటేనే ఒళ్ళంతా పులకరిస్తుంది. ఆ మాటకోసం దివారాత్రాలు కృశిస్తున్న..

నీ

దివాకర్

చదువుతున్న ప్రిన్సిపాల్ కళ్ళజోడు సవరించుకొని ఎదురుగా ఉన్న దివాకర్‌వైపు తీక్షణంగాచూసి "మిస్టర్ దివాకర్ నిన్ను డిబార్ చేస్తున్నాను! గెటౌట్ ఫ్రం హియర్" కోపంగా గర్జించాడు.

విషణ్ణవదనంతో ప్రిన్సిపాల్ రూంలోంచి బయటపడ్డాడు దివాకర్. తలెత్తిచూసి టక్కున ఆగిపోయాడు. ఎదురుగా...

పగపట్టిన త్రాచులా ఉగ్రరూపంతో మృదుల.

"మిస్టర్! నువ్వంటే నాకు అసహ్యం. ముఖ్యంగా నీ కళ్ళు చూస్తుంటే పరమ అసహ్యం. ఇంకోసారి ఇటువంటి పిచ్చివేషాలు వేస్తే జైలు వూచలు లెక్కపెట్టాల్సివస్తుంది. ఇదిగో ఇది చూడు" విసురుగా ఒక కవరు అతని ముఖంమీద విసిరేసి, విసవిస నడిచి పోతున్న ఆమెను చూసి దెబ్బతిన్న పావురంలా విలవిలలాడిపోయాడు.

కవరు విప్పి చూశాడు. అది... మృదుల పెళ్ళి శుభలేఖ!

ప్రాణానికన్నా మిన్నగా భావించిన ఆమె తనను తృణీకరించిందంటే అతని దుర్బల హృదయం తట్టుకోలేకపోయింది. తన చదువుకొరకై రెక్కలు ముక్కలు చేసుకొంటున్న తండ్రి కళ్ళముందు కన్పించాడు. తన చదువు పూర్తయి ఉద్యోగం చేస్తే ఆనందంగా వుండవచ్చు అని ఆశతో ఎదురుచూస్తున్న తల్లీ చెల్లెలు జ్ఞాపకం వచ్చారు. తను డిబార్ అయినట్లుగా వాళ్ళకి తెలిస్తే...

* * *

నూతన వివాహ పారవశ్యంలో ముగ్ధలా సిగ్గుపడుతూ తీయనివూహలతో అరమోడ్పు కన్నులు చేసి ఆలోచిస్తున్న మృదుల, సరిత నెమ్మదిగా చెప్పిన వార్తకి ఉలికిపడింది. భయంతో కళ్ళు రెపరెలాడాయి. షాకు తిన్నట్లుగా వణికిపోయింది. "అవునే దివాకర్ నిద్రమాత్రలుమింగి చనిపోయాడట. 'నా చావుకి ఎవరూ బాధ్యులు కారు' అని వ్రాసి వున్న కాగితం జేబులో వుందట"

మృదులకి ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లనిపించింది. అర్థిస్తున్నట్లుగా వున్న అతని చూపులు. ఎక్కడ్నుంచో పొంచి చూస్తున్నట్లుగా... ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

* * *

"మృదూ! త్వరగా రెడీ అవ్వు! పిక్చర్ టైమవుతుంది" ఆనంద్ మాటలకి నిరాసక్తంగా లేచింది మృదుల.

"ఏమిటి? మృదూ! నీలో ఏదో మార్పు కన్పిస్తుంది. పెళ్ళికాక ముందు, చలాకీగా కుబుసం విడిచిన పాములా మెలికలు తిరగేదానివి? ఎందుకిలా మన్నుతిన్న పాములా మారిపోయావ్? పెళ్ళవగానే నాపై ప్రేమ తగ్గిందా?" హాస్యంగా ముక్కుతో బుగ్గని పొడిచాడు.

అతని చర్యను హర్షించనట్లుగా చటుక్కున దూరం జరిగింది. ఎలాగో బలవంతంగా పిక్చర్‌కి బయలుదేరదీశాడు ఆనంద్.

సినిమాహాల్లో ముళ్ళమీద కూర్చున్నట్లుగా కూర్చొంది మృదుల. సినిమా ప్రారంభమయింది. హీరోని గతంలో ప్రేమించి అకారణంగా చనిపోయిన ఒక యువతి ఆత్మ అతని భార్యని ఆవహించి, ప్రియునితో తన కోరికను తీర్చుకోవాలని ప్రయత్నిస్తుంది. ఆత్మలనేవి వున్నాయని వాటితో మాట్లాడి, ఆ మాటలను రికార్డ్‌కూడా చేశారని డాక్టర్ పాత్రధారి వివరిస్తున్నాడు.

ఆనంద్ సినిమాలో లీనమయ్యాడు.

అప్రయత్నంగా మృదుల శరీరం కంపించింది. వణుకుతున్న స్వరంతో "ఏమండీ నాకెలాగో ఉంది. ఇంటికి వెళదాం" చటుక్కున లేచింది.

ఆనంద్ అయోమయంగా ఆమెను అనుసరించాడు.

ఇంటికి వెళ్ళగానే మంచమ్మీద వాలిపోయింది మృదుల.

"ఆనంద్! నిజంగా ... నిజంగా... ఆత్మలనేవి వుంటాయా?" సందేహంగా ప్రశ్నించింది.

"అదంతా పట్టి ట్రాష్" కొట్టిపారేశాడు ఆనంద్.

"ఆనంద్!" అరివాసనుకొంది. గొంతులోమాట గొంతులోనే వుండిపోయింది. ఎదురుగా... అర్థిస్తున్నట్లు.. జాలిగా... అవే మాపులు... అతనిమొహం... అంతకంతకు దగ్గరగా సూదుల్లా పొడుస్తున్న అవే మాపులు... ఇంకా ఇంకా దగ్గరగా... వెన్నెముకలోంచి వణి పుడుతున్నట్లుగా అనుభూతి...

"నో! నో!" గట్టిగా అరచి ఆనంద్ని ఒక్క తోపు తోసి బయటికి పరుగెత్తింది మృదుల.

ఆనంద్ నిశ్చేష్టుడయ్యాడు. "ఏమిటి? ఏమైంది మృదులకి??"...

* * *

మెదడంతా అశాంతిగా వుంది. మాటిమాటికి కణతలు నొక్కుకుంటూ దిండుమీద వాలింది మృదుల. "మనసెందుకిలా బలహీనమవుతుందో..." తనకే అర్థం కావడంలేదు. నిజంగా... ఆ సినిమాలో జరిగినట్లుగా దివాకర్ చనిపోయి తనమీద పగతీర్చుకుంటున్నాడా? దివాకర్ ఆత్మకూడా ఆనంద్‌ను ఆవహిస్తే..." భయంతో గజగజ వణికిపోయింది.

"లేదు! అంతా అబద్ధం... ఆత్మలు లేవు..." అంతరాత్మ ఘోషించింది.

బయట హాల్లో తీవ్రంగా ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు ఆనంద్.

మృదుల మనసులో వున్న బాధేమిటో తెలుసుకోవాలి" ధృఢనిశ్చయంతో నెమ్మదిగా గదిలోకి అడుగుపెట్టాడు ఆనంద్. మంచమ్మీద అలసటగా పడుకుని వుంది మృదుల. నెలరోజుల్లోనే పూర్తిగా చిక్కిపోయింది. వెక్కిళ్ళు పలవబడ్డాయి. తల్లిదండ్రులమీద బెంగపెట్టుకుందా?... ఒక్కసారి ప్రేమతో అతని మనసు ఆర్ద్రమైంది.

"మృదూ!" మార్దవంగా పిలిచాడు.

ఉలిక్కిపడింది మృదుల. భయంగా అతనివేపు చూసింది.

"మృదూ! నేను. ఎందుకలా భయపడుతున్నావ్?" ఆనంద్ దగ్గరగా వచ్చాడు.

అదురుతున్న గుండెతో వెనక్కి జరిగింది.... "అవే... అవే చూపులు... అర్థిస్తున్నట్లుగా... అసహ్యంగా,, గొంగళిపురుగులా... అవే చూపులు..." ఒళ్ళంతా స్వేదంతో తడిసిపోయింది. చేతులు వణుకుతున్నాయి.

"ఏమిటి? మృదూ ఏమైంది?" ఒక్క వుదుటున దగ్గరకు రాబోయాడు.




"నో రావద్దు... వద్దు... రాస్కెల్..." పూనకం పట్టినదానిలా అరుస్తూ మంచం దిగింది మృదుల.

"ఏమైంది మృదులా! నీకేమైనా..." ఆనంద్ అయోమయంగా చూశాడు

"అవే! అవే చూపులు! వద్దు... దివాకర్! దగ్గరకు రాకు... రాకు" పిచ్చిగా కేకలు వేయసాగింది.

ఆనంద్ క్షణంపాటు అప్రతిభుడయ్యాడు. 'దివాకరెవరు?'.. మృదులా ప్లీజ్ శాంతించు... నా మాటవిను.."

"నో నీమాట వినను. స్టాప్‌దేర్!... కాళికలా గర్జించింది మృదుల. బలహీనంగా వున్న ఆమె తూలిపోతుంది. శక్తినంతా కూడగట్టుకుని ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తుంది. భయంతో ఉద్వేగంతో ఆమె గుండె ఎగసిపడుతుంది. టేబుల్‌మీది పండ్లు కోసుకునే కత్తి చేతిలో బిగుసుకుంది.

ఆనంద్ మంచం అడ్డంగా వుండడంతో అటు తిరిగి వస్తున్నాడు.

"అవే చూపులు ప్రపంచంలోని దైన్యాన్నంతా కళ్ళలో నింపుకున్నట్లుగా మనసను తొలి చేస్తున్నట్లుగా అసహ్యంగా... అవే.. చూపులు.."

వెనక్కి వెనక్కి నడుస్తున్న మృదుల గిర్రున తిరుగుతున్న టేబుల్‌ఫాన్ గమనించే స్థితిలో లేదు... ఇంకొక్క అడుగు వెనక్కి వేస్తే...

"మృదులా?" ఒక్క అంగలో మృదులని పట్టుకొని ముందుకి లాగాడు ఆనంద్. మరుక్షణమే కెవ్వుమన్న ఆనంద్ చావుకేకతో ఆ గది ప్రతిధ్వనించింది. రక్తసిక్తమయిన తన చేతిలోని కత్తిని చూసి అలాగే స్పృహ తప్పిపోయింది మృదుల. *